## ఈ వారం కథ

# ఎవరికి వారే యమునా తీరే

డా॥ చల్లా రాధాకృష్ణశర్మ

నా మతిమరుపుని చూసి నేనే ఆసహ్యించుకున్నాను. బయలు దేరేంతవరకు అడ్రెస్సు కాగితం స్మృతిపథంలో మెదులుతూనే వుంది. తీరా బస్సు ఎక్కిన తర్వాతగాని ఆ సంగతి గుర్తుకి రాలేదు. సరియైన అడ్రస్సు లేకుండా ఢిల్లీ వంటి నగరంలో- అందులోనూ కొల్లేటి చెరువులా కనిపించే రోహిణి ప్రాంతంలో సులభంగా ఇల్లు కనుక్కోవడం మాటలు కాదు. తలప్రాణం తోకకు వస్తుంది. తిరిగి ఇంటికి వెడదామనుకున్నాను. కాని దొరక్క దొరికిన బస్సుని విడిచి పెట్టడం అవివేకమనిపించింది. నా మతిమరపును తిట్టుకుంటూ అలాగే ప్రయాణం సాగించి రోహిణి చేరుకున్నాను. సుమారు రెండు గంటలు పట్టింది ప్రయాణం. భోజనంచేసి బయలుదేరానేమో, మధ్యమధ్య కునికిపాట్లు పడ్డాను.

సెక్టరు గుర్తుండడం వల్ల కొంత శ్రమ తప్పిందనుకున్నాను. ఒక్కొక్క బ్లాకుగా అన్వేషణ మొదలు పెట్టాను. నా అవివేకం బయటపడింది. ఎన్ని ఫ్లాట్లని వెతకను ! మెట్లు ఎక్కి దిగడంతో కాళ్లు నొప్పి పుట్టాయి. ఇలా గుడ్డిగా అన్వేషించడం మంచిది కాదనుకుని తెలుగు వారెవరైనా కనిపిస్తే వాకబు చేసి మరీ వెతకడం మంచిదనుకుని ఒకచోట నిలబడి వచ్చే పొయ్యే మొహాల్ని ఎగాదిగా చూడసాగాను. నా అదృష్టం పండింది ! ఒక యువకుడు నా వాలకం కనిపెట్టి, "మీరు తెలుగువారా?" అని అడిగాడు. అవునన్నాను అంతే. మా యిద్దరి మధ్య ప్రశ్నోత్తరాలు నడిచాయి పురాణయుగంలో శూరవీరుల మధ్య బాణాలు రాకపోకలు సాగించినట్టుగా.

"అడ్రస్సువుందా?"

"ఆ కాగితం మరిచిపోయాను. సెక్టరు మాత్రం గుర్తుంది"

"రోహిణి అంటే యేమనుకున్నారు? ఒక పట్టణమంత పెద్ద వూరది"

" ఆ విషయం నాకూ తెలుసు . . ."

"మరి తెలసీ, సరి అయిన అడ్రస్సు లేకుండా యిందాకటి నుంచీ యింటి కోసం గాలిస్తున్నారా ?"

నా అభిమానం దెబ్బతిన్నా అతన్ని ఏమీ అనలేకపోయాను.

"ఇంతకూ ఎవరు కావాలి మీకు?"

". . . గారు నా ఆప్తమిత్రులు, ఆయన్ని కలుసుకోవాలి"

"ఆయన నల్లగా, పొడుగ్గా వుంటారా ?'

" అవును"

" మాట అదోలా వుంటుంది . . ."

" అవును"

"కొంచెం బొంగురు గొంతనుకుంటాను'

"అంత బొంగురు గొంతు కాదు"

"ఆయన పేరేమన్నారు ?"

పేరు మళ్లీ చెప్పాను.

"ఆయన్ని నాలుగైదు సార్లు యఫ్ బ్లాకు వద్ద చూసిన గుర్తు. మీ రక్కడకి వెళ్లి వాకబు చెయ్యడం మంచిది. మీ శ్రమ ఫలిస్తుంది"

ఆ యువకుడి హితోపదేశం అనుసరించి సి బ్లాకు నుంచి కాళ్లీడ్చుకుంటూ యఫ్ బ్లాకు దాకా వెళ్లాను. గళ్లలుంగీ కట్టుకున్న ఒక వృద్ధుడు కనిపించాడు. కేరళీయుడేమో అనుకుని వచ్చీరాని మలయాళంలో ప్రశ్నించాను. అందుకు నవ్వుతూ ఆయన నేను మద్రాసీ కానని హిందీలో బదులు చెప్పాడు. అప్పుడు ఇంగ్లీషులో అడిగాను. ఆయన నవ్వుతూనే నాకు ఇంగ్లీషు తెలీదన్నాడు. ఇక నేను బిక్కమొహం వెయ్యక తప్పింది కాదు. నా వంక చూస్తూ నవ్వుకుంటూ ఆయన వెళ్లిపోయాడు. నవ్వు ఆయన ట్రేడ్ మార్కులా తోచింది నాకు.

అక్కడే నేను నుంచున్నాను. మళ్లీ నా అదృష్టం పండింది. అయితే యీసారి నన్ను సమీపించింది యువకుడూ కాదు, వృద్ధుడూ కాదు. నడివయస్సులో వున్న ఒక తమిళుడు. నేను వైగైనదీ తీరవాసుణ్ణి అని తెలుసుకోగానే ఆయనకి ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. మేము మాటల్లో పడ్డాము. నా సమస్యను తెలియజేశాను. అంతావిని కొంచెంసేపు ఆలోచనలో పడి "ఆంధ్రావాళ్లు సి బ్లాకులో వుంటున్నారు అక్కడికి మీరు పోండి" అని సలహా యిచ్చాడు. నేను సి బ్లాకుకు దారి తీశాను "నేను కూడా మీతో వస్తును" అంటూ ఆయన నాతో పాటు నడక సాగించాడు. మాటల్లో పడ్డ మాకు దూరం తెలీలేదు.

"మీది కావేరి తీర మనుకుంటాను "

"ఒకప్పుడు"

"ఇప్పుడు యమునా తీరమా !"

"అంతదా ... ఎక్కడుంటే అక్కడే మనవూరు"

"మీరన్నది అక్షరాలా నిజం"

"ఎ బ్లాకులో ఒక ఫ్లాట్ తీశాను .."

" మీ కెంతమంది పిల్లలు " " ఇద్దరూ మగపిల్లలుదా పెద్దపిల్లకాయ మయూర్ విహార్‌లో ఫ్లాట్‌వెలకు తీశాడు. రెండో పిల్లకాయకి ఆర్కెపురంలో క్వార్టర్స్ దొరికింది "

"అరటితోపులు, కొబ్బరి తోటలు, పచ్చని పొలాలతో కళకళలాడే కావేరి తీరంలో పెరిగిన మీకు యీ ఢిల్లీ ..." నేను మాట పూర్తి చేసేంతలోపల ఆయన "నాకు ఈ సిటీ బాగా పట్టింది" అన్నాడు సంతోషంగా

"మరి మీ ఇంట్లో వాళ్లకు?"

"వాళ్లకు దా పట్టలేదు"

మౌనం వహించి నేను నడుస్తున్నాను.

"ఇదిదా సి బ్లాక్ ... ఇక్కడదా మీ ఆంధ్రావాళ్లు ఇద్దరు ముగ్గురు వుంటురు' ' అంటూ ఆయన ఒక ఫ్లాటులోకి వెళ్లి ఒకాయనతో మాట్లాడుతూ వెలుపలకి వచ్చాడు "ఈయనదా నా బెస్ట్ ఫ్రెండ్ ... మూర్తిగారంటురు. మేమిద్దరం రోజా వాకింగ్‌లో కలుసుకుంటుము . . . . "

"ఎప్పుడొచ్చావయ్యా" అంటూ మూర్తి నన్ను కౌగిలించుకున్నంత పనిచేశాడు. తమిళ సోదరుడు నిర్ఘాంతపోయాడు.

"ఈయనా నేనూ ఆప్తమిత్రులం" అన్నాను నేను, మిత్రుణ్ణి చూసిన సంతోషం కొద్దీ. "మూర్తిగారూ మీరూ నేనూ - అంతా మిత్రులందా ...." అంటూ తమిళ మిత్రుడు వెళ్లిపోయాడు. ఆయన అన్నట్టు మనమంతా మిత్రులమే. లేకపోతే భిన్నభిన్న భాషలవారు, సంస్కృతుల వారు ఒక్కటిగా ఎలా వుండగలుగుతారు యింత పెద్ద నగరంలో ! అనుకుంటూ నేను మూర్తితో పాటు లోపలికి వెళ్లాను.

యోగక్షేమాలు అవీ కనుక్కోవడం ముగిసింది. లోకాభిరామాయణంలో



పడ్డాము. సాబ్ అంటూ ఒక యువకుడు వచ్చాడు వంటింట్లోంచి. మా ముందు రెండు టీ కప్పులు ఉంచాడు. లోపలికి వెళ్లి ఒక ప్లేటు నిండా బిస్కెట్లు తెచ్చాడు.

"వీడిపేరు గంగారాం. యు.పి. ప్రాంతానికి చెందిన వాడు. నమ్మకస్థుడు. నాతోపాటే వుంటాడు. వంటవార్పులు అవన్నీ వాడే చూసుకుంటాడు"

మూర్తి భార్య కాలధర్మం చెంది ఆరేళ్లయింది. అప్పటి నుంచి తపన చెందాను ఆయన్ని చూడాలని. ఇప్పటికి కుదిరింది ముహూర్తం. నెమ్మదిగా గతంలోకి దింపాను.

"అయితే అమలాపురం విడిచిపెట్టి నట్టేనా?"

"అక్కడేముంది! తాతలనాటి పొలమూ పుట్రా పోయి చాలా కాలమయింది. రాకపోకలు తగ్గిపోవడంతో, అమలాపురానికి నేనిప్పుడు పరాయివాణ్ణి అయ్యాను. మా బంధువుల్లో చాలా మందికి నేనెవర్నో తెలీదు. ఈ తరం వాళ్ళకయితే అసలు తెలీదు. వాళ్ళూ నాకు తెలీదు. మా పిల్లలకి అమలాపుర మంటూ ఒక వూరున్న సంగతి కూడా తెలీదు. వాళ్లిక్కడ పెరిగి పెద్దవాళ్లయ్యారు". పుట్టిన గడ్డకు దూరమైపోయ్యానన్న విచారం మూర్తి మాటల్లో గోచరించింది. "పిల్లలంటే గుర్తు కొచ్చింది అడగడం మరచిపొయ్యాను ఇప్పుడెక్కడున్నాడు పెద్దవాడు?"

"స్టేట్స్‌లో వున్నాడు. వాళ్లమ్మ పోయినప్పుడు వచ్చాడు. మళ్లీ యిక్కడికి రాలేదు. ఆ మధ్య నేనే ఉత్తరాలు రాసేవాణ్ణి ఇప్పుడు రాయడం కూడా మానేశాను . . . .' ' మూర్తి చెపుతున్న ఒక్కొక్కమాట బాణంలా నా గుండెలో గుచ్చుకుంది.

"రెండోవాడు?" "ఈ వూళ్లోనే విడిగా వుంటున్నాడు. నా మూర్ఖత్వమను మరేమన్నా అను, వాళ్లదగ్గర నేను వుండలేక పోయాను. స్వతంత్రంగా వుండాలనే ఉద్దేశం నాలో తిష్టవేసుకుంది. ఎందుకు నాన్నా విడిగా వుండడమని వాడూ అడగలేదు. అమ్మాయీ, అస్వతంత్రురాలు ... కలకత్తాలో వుంది"

"ఎన్నాళ్లని యిలా ఒంటరిగా వుంటావు'? అని అడిగాను, ఉండబట్టలేక. "ఉండటానికి యీ ఫ్లాటు వుంది. వంటచేసి పెట్టడానికి గంగారాం వున్నాడు. సాగినంతకాలం సాగనీ . . . . మూర్తి యింకా యేదో చెప్పేవాడే. నాకు మొదట్లో కనిపించిన యువకుడు లోపలికి రావడంతో అంతరాయం కలిగింది. నన్నుచూసి ఆశ్చర్యపోతూ అతను, "మూర్తిగారంటే ఎవరో అనుకున్నాను ... ఇక్కడ ఈయన్ని, మేము పంతులుగారని పిలుస్తాము. పంతులుగారంటే సరాసరి యీ ఫ్లాటుకి మిమ్మల్ని తీసుకొచ్చి వుండేవాణ్ణి. నేను మూడో అంతస్తు ఫ్లాటులో వుంటున్నాను" అన్నాడు.

'మూర్తి పంతులయ్యాడన్న మాట!" అన్నాను.

"మరేం లేదయ్యా. ఇక్కడున్న తెలుగవాళ్లు పెళ్లిముహూర్తాలకని, మంచిరోజు ఎప్పుడని... యిలా నాదగ్గరికి వస్తూపోతూ వుంటారు. పంచాంగం చూసి చెపుతూ వుంటాను. అసలు పేరు మరుగున పడిపోయింది"

'అదా సంగతి" నవ్వి వూరుకున్నాను.

ఆతిథ్యం స్వీకరించి వెళ్లమని మిత్రుడు బతిమలాడినా, మూర్తిని కష్టపెట్టడం నాకు భావ్యమనిపించలేదు. ఇంకోరోజు వస్తానని చెప్పి, అతని అనుజ్ఞ తీసుకుని బస్సు స్టాపింగు చేరుకున్నాను. కొంత సేపటికి బస్సు వచ్చింది. ఎక్కి కూర్చున్నానన్న మాటేగాని మనస్సు మాటిమాటికి అనుకోసాగింది . . . . ఎవరికి వారే . . . .